సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ၊ 13 ၊ జనవరి ၊ 2025





## రికవరీ నిల్

జిల్లాలో చోరీ సొమ్ము రికవరీ కాకపోవడంతో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వివరాలు 8లో ▸



## రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

వనపర్తిలోని ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /16.0

## వాతావరణం

ఉదయం, రాత్రివేళలో చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**మహబూబ్‌నగర్ క్రైం:** జిల్లాలో ప్రజలు సంక్రాంతి పండగ ఎలాంటి వివాదాలు, గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండగ ఏర్పాట్లలో యువత ఆదర్శంగా ఉండాలని, మహిళలను గౌరవించాలన్నారు. తెల్లవారుజామున ఇంటి ఎదుట మహిళలు ముగ్గులు వేస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితులు అడ్రస్‌లు అడుగుతూ మాట కలిపి ఏమార్చి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. మహిళలు, యువతులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. దూర ప్రాంతం వెళ్లే వారు ఇళ్లలో విలువైన వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే సెల్‌ఫోన్‌లకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

### మార్కెట్‌కు సెలవులు

**దేవరకద్ర:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులు సెలవు ఉంటుందని కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం భోగి, మంగళవారం మకర, బుధవారం కనుమ పండుగ సందర్భంగా మార్కెట్‌లో ఎలాంటి లావాదేవీలు జరగవన్నారు. తిరిగి గురువారం మార్కెట్ యార్డులో లావాదేవీలు ప్రారంభమవుతాయని, రైతులు ఈ విషయం గమనించాలని ఆమె కోరారు.


### పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు



**పాలమూరు:** భవనం పై కప్పు నుంచి నీళ్లు లీకవడం, పరిశుభ్రత లోపించడంతో జనరల్ ఆస్పత్రి వైద్యాధికారుల తీరుపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న డ్రెయినేజీ, పరిసర ప్రాంతాల శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు విభాగాలు తనిఖీ చేశారు. ప్రధానంగా సర్జికల్ విభాగంలో అపరిశుభ్రతను గమనించి ఆశ్చర్యపోయారు. సర్జరీలు చేసిన తర్వాత ఉండే వేస్టేజ్‌తో రోగులకు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆస్పత్రిలో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, అసలు శానిటేషన్ ఏజెన్సీ ఏం పని చేస్తుందని ప్రశ్నించారు. చాలా వరకు గదులు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఏదైనా వాటికి ఉపయోగించాలని సూచించారు. క్యాజువాలిటీ పైభాగం పైకప్పు నుంచి నీరు కావడంపై వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. పేదలు ఏ రోగం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇక్కడ ఉన్న అపరిశుభ్రత వాతావరణం వల్ల కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇకపై ప్రతి నెల 1, 15 తేదీల్లో ఆస్పత్రి తనిఖీ చేస్తానన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి తప్పులు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే ఆరు నెలల్లో ఆస్పత్రిలో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రికి నిధుల కొరత ఉందన్నారు. విద్యానిధి తరహాలోనే పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్య నిధిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### జూరాలలో తగ్గుతున్న నీటిమట్టం

**గద్వాల:** ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని అయిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటినిల్వ తగ్గుముఖం పట్టినట్లు సాగునీటిపారుదల శాఖ ఏఈ వెంకటేష్ తెలిపారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.695 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో జలాశయంలో గ్రాస్ లెవల్ 2.988 టీఎంసీలు, ఎంటీడీడీఎల్ పైస్థాయిలో 4.032 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలతోపాటు ఆర్డీఎస్ ప్రాజెక్టు, కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, జూరాల హైడల్ ప్రాజెక్టులకు నీటి పంపింగ్ పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు.



మూడు రోజుల సంక్రాంతి పండగకు పల్లెలు, పట్టణాలు ముస్తాబయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను **అమ్ముకొని** సొమ్ము చేసుకునే పనిలో రైతులు.. వాకిళ్లలో **ముగ్గులు** వేస్తూ యువతులు.. తీపి వంటకాల తయా**రీలో మహిళ**లు.. పతంగుల ఎగరవేతలో చిన్నారులు.. **ఆటల పోటీల్లో** యువకులు.. కోడిపందేలు, ఎద్దుల బండ్లు, **పొట్టేళ్ల పోటీల** నిర్వహణలో పెద్దలు.. ఇలా ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.. మరోవైపు బంధుమిత్రుల రాక.. కొత్త కోడళ్లు, అల్లుళ్ల సందళ్లతో పండగ కళ ఉట్టిపడుతోంది.. మూడురోజుల పండుగలో భాగంగా సోమవారం భోగి జరుపుకోనున్నారు.. పాత వస్తువులను పోగేసి భోగి మంటల్లో కాల్చేస్తారు.. పాడిపంటలు.. సిరిసంపదలతో తులతూగాలని కోరుకుంటారు..

– స్టేషన్ మహబూబ్‌నగర్/ జడ్చర్ల టౌన్

# భోగి సంబురం..



**సంక్రాంతి వేడుకలు భోగి పండుగతో ప్రారంభమవుతాయి. సంక్రాంతి ముందురోజు వచ్చే ఈ** పండుగ పూట ఉదయాన్నే ఇంట్లోని లేదా ఊళ్లో ఉన్న

### 'పాత' అంతా పోగేసి..

'పాత' అంతా పోగేసి కాల్చివేసే ప్రక్రియను **భో**గి మంటలుగా పిలుస్తారు. హోమాగ్నికి ప్రతి**రూప**మైన ఈ భోగి మంటల అంతరార్థం ప్రజలం**తా** భోగభాగ్యాలతో విలసిల్లాలనే. హోమాగ్ని **భస్మాన్ని** ధరించినట్లే ఈ భోగి మంటల ద్వారా వచ్చిన **బూడిదను పి**ల్లలు, పెద్దలు నుదుటన ధరిస్తారు. చలిని తరిమే**యటం కూడా ఇం**దులోని భావం. జిల్లాకేంద్రంలో సోమవారం భోగి వేడు**కలను ఘనంగా జరుపు**కోనున్నారు. తెల్లవారుజామునే ఆయా కాలనీల్లో భోగి మంటలు వేస్తారు.

### జిల్లాలో అట్టహాసంగా సంక్రాంతి వేడుకలు

- ఊరూరా యువతకు ఆటల పోటీల నిర్వహణ
- ముచ్చటగొలిపేలా రంగవల్లులు.. నోరూరించే పిండివంటలు
- పట్టణాల నుంచి స్వగ్రామాలకు తరలివస్తున్న బడుగు జీవులు
- పల్లెల్లో ఉట్టిపడుతున్న పండుగ సంప్రదాయం

### నువ్వుల రొట్టెలు ప్రత్యేకం



**భో**గి పండగ రోజున అందరి ఇళ్లల్లోనూ నువ్వుల రొట్టెలు చేయడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కొందరు బియ్యం పిండి, మరి కొందరు జొన్నపిండిలో నువ్వులు వేసి రొట్టెలు చేసుకోవడం ఆనవాయితీ. చలికాలం కావడం వల్ల నువ్వులు వంటికి వేడిని అందిస్తాయని భోగి రోజున వాటిని చేసుకుని ఆరగిస్తారు.

### నారాయణుడి దీవెనలు..



చిన్నారులకు భోగి పండ్ల వేడుక (ఫైల్)

**భో**గి పండుగ రోజు మహిళలంతా కలిసి తమ పిల్లలను ఆసనంపై కూర్చోబెట్టి నెత్తిమీద భోగి పళ్లు పోస్తారు. తలపై రాగి నాణేన్ని ఉంచి నారాయణుని స్వరూపమైన రేగు (బదరీ) చెట్టు పళ్లను పోస్తూ వారు సకల సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని దీవిస్తారు. ఇలా పోస్తే నారాయణుడి దీవెనలు అందుతాయని భావిస్తారు. వేడుకలో భాగంగా పేరంటాలకు పసుపు, కుంకుమలు, చందనం అందించి.. శనగలు, పటికబెల్లం, నువ్వులు, బెల్లం కలిపి దంచిన చిమ్మిలి ఉండలు ఇస్తారు. ఈ అన్ని కార్యాల వల్ల గ్రహశాంతి కూడా కలుగుతుందని నమ్ముతారు.

### ప్రాచీన సంప్రదాయం



**సంక్రాంతి పండుగ రోజుల్లో ఇళ్ల ఎదుట ముగ్గులు వేయడం ఆధ్యాత్మికతకు నెలవుగా చెప్పవచ్చు. ముగ్గులు వేయడం ప్రాచీన కాలం నుంచి వస్తున్న సంప్ర**దాయం. బియ్యపు పిండితో వేసిన ముగ్గుల్ని రంగులతో అలంకరించి ఆ ముగ్గులో బంతిపూల రేకులు, గొబ్బెమ్మలను ఉంచితే లక్ష్మీదేవి కటాక్షిస్తుందని, ఆ ఇంట్లో అందరికీ ఆయురారోగ్యాలు, ధనధాన్యాలు, సుఖశాంతులు కలగజేస్తుందని నమ్మకం. పొద్దున్నే ముగ్గు వేయడం చక్కటి వ్యాయామం, ఇది ఒక యోగాసనం లాంటిది.

– రావూరి వనజ, వెంకటేశ్వరకాలనీ, మహబూబ్‌నగర్

### రంగోలి అని పిలుస్తారు..



ఇళ్ల ఎదుట ముగ్గులు వేయడం శుభసూచకం. దీన్ని ఉత్తరభారత దేశంలో రంగోలి అని పిలుస్తారు. ముగ్గులు వేయడం వల్ల ఇళ్లలోకి క్రిమికీటకాలు రావు. ముగ్గుల ద్వారా వేసిన వారి నేర్పు, ఓర్పుతో కూడిన ప్రతిభ. సృజనాత్మకత, విజ్ఞానం బయటికి వస్తాయి. సమాజంలో ఎంతటి టెక్నాలజీ వచ్చినా ముగ్గులు వేయడం మరిచిపోవడం లేదు. పల్లెల నుంచి పట్టణాలకు ముగ్గులు వేయడం ఆనవాయితీగా వస్తోంది.

– శాంతారెడ్డి, టీచర్స్‌కాలనీ, మహబూబ్‌నగర్

### ఆకట్టుకునేలా ముగ్గులు..

**సం**క్రాంతి పండుగను పురస్కరించుకొని యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా వివిధ రంగులతో అందమైన ముగ్గులను తీర్చిదిద్దుతున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు.



ఆకట్టుకుంటున్న ముగ్గులు

### పల్లెబాట..

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో ఇప్పటికే పిల్లలు ఇళ్లకు చేరుకున్నారు. కొత్తగా వివాహాలు అయిన వారిళ్లలో ఆడపడుచులతోపాటు అల్లుళ్ల రాకతో ఉత్సాహం నెలకొంది. ఇక జీవనోపాధి, వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు తరలివస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ఇతరత్రా ప్రైవేట్ వాహనాలన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి.



# బీఆర్‌ఎస్ ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే..



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

- కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టుల నిర్మాణాలు
- పాలమూరును తెలంగాణ కోనసీమగా మారుస్తాం
- ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి యాక్షన్ ప్లాన్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**నాగర్‌కర్నూల్/ తిమ్మాజిపేట/ బిజినేపల్లి:** 'తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నీటి కోసం.. అలాంటిది బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదు.. రాష్ట్రంలో ప్రస్తుతం నీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో నిర్మించినవే.. ఉమ్మడి పాలమూరు జిల్లాను తెలంగాణ కోనసీమగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతుందన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించిన ఆయన.. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపలి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, మేఘారెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లిలో మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలు పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. రూ.38 వేల కోట్లతో మొదలుపెట్టిన పాలమూరు ప్రాజెక్టు పనులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, దానిని తమ ప్రభుత్వం ఐదేళ్లలోనే పూర్తిచేసి చూపిస్తుందన్నారు. కేఎల్‌ఐ పెండింగ్ పనులను పూర్తిచేస్తామని, కృష్ణానది వాటాలో ఉన్న ప్రతి నీటి చుక్కను వినియోగించడానికి ఖర్చుకు వెనకాడమని స్పష్టం చేశారు.

**నిర్వాసితులను ఆదుకుంటాం..**

నార్లాపూర్ భూ నిర్వాసితులకు గత ప్రభుత్వం జీఓ 123 ద్వారా పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేసిందని మంత్రి విమర్శించారు. 'పాలమూరు' భూ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని, ముంపు గ్రామాలకు సంపూర్ణంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. భూ సేకరణలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర, చిన్నకేశవ ఎత్తిపోతలను తమ ప్రభుత్వమే పూర్తి చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మార్కండేయ ఎత్తిపోతలకు మొదట రూ.76 కోట్లు కేటాయించి.. తర్వాత రీడిజైన్ పేరుతో రూ.86 కోట్లకు పెంచిందన్నారు. అందులో రూ.6 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని.. పథకం పనులకు కేవలం రూ.4 కోట్లు మాత్రమే విడుదల చేసి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాధాన్యత క్రమంలో ఈ పథకానికి నిధులు కేటాయించి పూర్తి చేశామన్నారు. చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని సూచించారు. రైజింగ్ తెలంగాణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, విద్యుత్‌శాఖ సీఎండీ ముషారఫ్ అలీ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు సమస్యలపై..
# గళం విప్పిన 'మందా'

- మాజీ ఎంపీ మృతితో స్వగ్రామం కొండేరులో విషాదఛాయలు



మందా జగన్నాథం (ఫైల్)

**అలంపూర్:** వృత్తిరీత్యా వైద్యుడు అయిన మందా జగన్నాథం అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి పాలమూరు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఈయన స్వగ్రామం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని కొండేరు అయినప్పటికీ.. విద్యాభ్యాసం, వృత్తి అంతా వేరే ప్రాంతాల్లో జరగడంతో పెద్దగా ఎవరికీ తెలియదు. కానీ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం ఎస్సీ రిజర్వ్ కావడంతో అక్కడి నుంచి పోటీ చేయడంతో స్థానికత గురించి జిల్లావాసులకు తెలిసింది. అయితే ఎంపీగా గెలిచిన మొదట్లో తెలియకపోయినప్పటికీ తరుచుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సమస్యలపై గళం విప్పి.. సుపరిచితుడయ్యారు. ప్రత్యేకించి పాలమూరు కరువు, వలసలకు మారు పేరైన జిల్లాకు సాగునీటి ప్రాజెక్టులు వస్తే సస్యశ్యామలం అవుతుందని.. వలసలు తగ్గిపోతాయని చెబుతుండే వారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం డీపీఆర్ రూపొందించే సమయంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. గత నెల 23న గుండె సంబంధ వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరిన మందా జగన్నాథం చికిత్స సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం సాయంత్రం కన్నుమూశారు.

**పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం..**

మందా జగన్నాథం తల్లిదండ్రులు ఉద్యోగ రీత్యా తెలంగాణలోని పలు జిల్లాల్లో విద్యాభ్యాసం సాగింది. నాగార్జున సాగర్‌లోని హిల్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదివారు. అనంతరం 5 నుంచి 8వ తేదీ వరకు నాగార్జున్ సాగర్‌లోని హైస్కూల్లో పూర్తి చేశారు. ఖమ్మంలోని నయా బజార్‌లో 9వ తరగతి కొంత వరకు చదివి అనంతరం వరంగల్ జిల్లా సంగంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9, 10 తరగతులు పూర్తిచేశారు. వికారాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎస్సీ, నిజాం కళాశాలలో పీయూసీ, వికారాబాద్‌లోని పద్మనాభ కళాశాలలో మళ్లీ పీయూసీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్ఎల్‌డీ, ఈఎన్‌టీ స్పెషలిస్టు సర్జన్ కోర్సులు చదివారు.

**కుటుంబ నేపథ్యం..**

మందా జగన్నాథం తల్లిదండ్రులు మందా పుల్లయ్య, సవారమ్మ. మందాకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూతురు ప్రసూతి గైనకాలజీలో మెడికల్ కోర్సు పూర్తి చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తుంది. పెద్ద కుమారుడు మందా శ్రీనాథ్ బీటెక్ మెకానికల్ ఇంజినీర్ చేసి ప్రస్తుతం సోషల్ వర్కర్‌గా ఉన్నారు. చిన్న కుమారుడు మందా విశ్వనాథ్ ఎంబీబీఎస్ చదివి వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు.

### నేడు అంత్యక్రియలు..

అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ దోబీ ఘాట్ వద్ద జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతితో స్వగ్రామం కొండేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

# గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన అదనపు కలెక్టర్ మోహన్‌రావు

**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు అధికారులు సన్నద్ధం కావాలని, షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు ప్రారంభించబోతోందని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన అర్హుల ముసాయిదా జాబితా ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ, వార్డుసభలలో చదివి వినిపించి అర్హుల జాబితా తయారు చేయాలని, అభ్యంతరాలు ఉంటే స్వీకరించి 10 రోజుల్లోగా పరిష్కరించాలని, 21 నుంచి 25 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా ఏడాదికి రూ.12 వేలు అందిస్తారని, ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలు ఈ పథకానికి అర్హులన్నారు. రేషన్ కార్డులో చేర్పులు, తొలగింపులు చేపట్టాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇంటి నిర్మాణ స్థలం కలిగి ఉన్నవారు, అద్దె నివాసంలో ఉండేవారు అర్హులన్నారు. ఈ నెల 16న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

### 'వివేకానందుడు గొప్ప ఆదర్శమూర్తి'

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్వామి వివేకానంద గొప్ప ఆదర్శమూర్తి అని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం పీయూలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి, ఆధ్యాత్మిక జ్యోతి, భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్ జానకి రాములు, అధ్యాపకులు బృందాదేవి, సూర్య, సత్యం, భరత్, శ్రీకాంత్ జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

# టెట్‌కు 656 మంది హాజరు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లాకేంద్రంలోని జేపీఎన్‌సీఈ, ఫాతిమా విద్యాలయంలో ఆదివారం జరిగిన టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు మొత్తం 729 మంది అభ్యర్థులకు గాను 656 మంది హాజరయ్యారు. జేపీఎన్‌సీఈలో 365 మందికి గాను 331, ఫాతిమా విద్యాలయంలో 364కు గాను 325 మంది పరీక్ష రాశారు. రెండు కేంద్రాలకు కలిపి మొత్తం 73 మంది గైర్హాజరైనట్లు ఇన్‌చార్జ్ అధికారులు శశికిరణ్, హర్షవర్ధన్ తెలిపారు.



### హోరాహోరీగా హ్యాండ్‌బాల్ టోర్నీ

- హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న రాష్ట్ర బాల, బాలికల జట్లు
- ఆకట్టుకున్న క్యాంప్ ఫైర్

వివరాలు 8లో ▸

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

దామరగిద్ద: మండల కేంద్రం శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. వివరాలు.. నారాయణపేటకు చెందిన శంకర్‌రావ్ తన భార్య రేఖ(30), ఇద్దరు కుమారులతో కలిసి కర్ణాటక రాష్ట్రం ముధోల్‌కు వెళ్లాడు. శనివారం రాత్రి నారాయణపేటకు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. దామరగిద్ద శివారుకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేఖపై టిప్పర్ వెనుక టైర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. శంకర్‌రావ్ కుడిచేయి మణికట్టు విరిగింది. కుమారులు ఆదిత్య, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. శంకర్‌రావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### నీటిగుంటలో పడి వ్యక్తి మృతి


రేణయ్య(ఫైల్)

మన్ననూర్: ప్రమాదవశాత్తు చెరువు సమీపంలోని నీటిగుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన అమ్రాబాద్ మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అమ్రాబాద్ మండలం ప్రశాంత్‌నగర్(మన్ననూర్)కి చెందిన రేణయ్య(45) వ్యక్తిగత పనుల నిమిత్తం ప్రశాంత్‌నగర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలో అత్యవసరమై రోడ్డు పక్కకు వెళ్లాడు. మద్యం మత్తులో నీటిగుంటలో బోర్లపడి మృతిచెందాడు. ఆదివారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### వాంతులతో వ్యక్తి..

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాలో శనివారం అర్ధరాత్రి కట్రావత్ నందు (45) వ్యక్తి వాంతులు చేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలోనే నందు మృతి చెందాడు. ఆదివారం అతని భార్య కాట్రావత్ భారతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ యువకుడు..


సంతోష్(ఫైల్)

హన్వాడ: మండలంలోని గొండ్యాల్ గ్రామానికి చెందిన సల్కె సంతోష్(28) అగ్ని ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గొండ్యాల్‌కి చెందిన సంతోష్ మద్యంమత్తులో చలిమంటలు కాచుకుంటూ అగ్నిప్రమాదానికి గురైన విషయం పాఠకులకు విదితమే. 108లో జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంతోష్ బీజేపీ కార్యకర్త పనిచేసేవాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక బీజేపీ నాయకులు పరామర్శించారు.

### ప్రేమ వివాహం విషయంలో ఘర్షణ

- ఇరువర్గాలపై కేసు నమోదు

ధరూరు : ప్రేమ వివాహం చేసుకున్న జంట విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండలంలోని మార్లబీడులో చోటుచేసుకుంది. రేవులపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. మార్లబీడులో ఎస్సీ కులానికి చెందిన యువతీ, యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారని, ఈవిషయంలో ఇరువర్గాల వారు శనివారం ఘర్షణ పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు. ఆదివారం ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపారు.

### లైన్‌మేన్‌కు గాయాలు

కొత్తపల్లి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్ తప్పిదం వల్ల లైన్‌మేన్‌కు గాయాలైన సంఘటన కొత్తపల్లి మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన లైన్‌మెన్ మోహిన్ దామరగిద్ద మండలంలోని లోకుర్తిలో విధులు నిర్వహిస్తున్నాడు. తన ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకొని సరిచేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కాడు. అప్పటికే సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ కృష్ణారెడ్డి మరొకరికి ఎల్‌సీ ఇచ్చాడు. ఈ క్రమంలో మొదటి వ్యక్తి ఎల్‌సీ రిటర్ చేయడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో స్తంభంపైన ఉన్న మోహిన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అప్రమత్తమైన మోహిన్ విద్యుత్ సరఫరా లేని వైరు సహాయంతో కిందకు వచ్చే ప్రయత్నం చేశారు. గాయాలు కావడంతో వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. లైన్‌మేన్‌కు ప్రాణాపాయం లేదని డాక్టర్లు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని విద్యుత్ ఏఈ బాల్‌రాజ్‌కు వివరణ కోరగా, డబుల్ ఎల్‌సీ ఇవ్వడం జరిగిందని ఈయనకు ఎల్‌సీ ఇచ్చిన విషయం మరిచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో విద్యుత్ షాక్‌కు గురైనట్లు తెలిపారు.

# రికవరీ నిల్

## పోయేది రూ.కోట్లలో స్వాధీనం లక్షల్లో

- 2024లో పెరిగిన దొంగతనాలు
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- పండుగ వేళ జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు



మహబూబ్‌నగర్ క్రైం: దొంగతనం జరిగిన ఇంట్లో పోయి సొమ్మును పోలీసులు పెద్దగా రికవరీ చేయలేకపోతున్నారు. చోరీలో దొంగలు దోచుకుపోయేది ఒక అంకె అయితే పోలీస్ లెక్కల్లో మరో అంకె కన్పిస్తోంది. ఇంటికి తాళం ఉంటే చాలు ఆరోజు రాత్రికి దొంగలు కన్నం వేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. మహబూబ్‌నగర్, జడ్చర్ల వంటి ముఖ్య పట్టణాల్లో పోలీసులు పెట్రోలింగ్, గస్తీలు చేపడుతున్నా దొంగలు వారి పనులు చక్కబెడుతున్నారు. ప్రధానంగా దొంగతనం జరిగిన సందర్భంలో కాజేసిన సొమ్ము అధికంగా ఉంటే ఎఫ్‌ఐఆర్‌లో మాత్రం తక్కువ చూపిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 2020లో రికవరీ శాతం 40.76ఉంటే 2024 వచ్చేసరికి 20శాతానికి పడిపోయింది. పేద, మధ్య తరగతి ప్రజలు నలుగురిలో గుర్తింపుకోసం కష్టపడి దాచుకున్న బంగారం, నగదును గుర్తు తెలియని వ్యక్తులు వాటిని ఒక్కరాత్రిలో దోచుకుంటే వారి బాధ వర్ణనాతీతం.

- మూడేళ్లలో జిల్లాలో రాత్రివేళలో అధికంగా దొంగతనాలు జరుగుతున్నాయి. 2024కు వచ్చేసరికి దొంగతనాలు మరింత పెరిగాయి. జిల్లాలో దొంగతనాలు అవుతున్న దాంట్లో మధ్యతరగతి కుటుంబాల ఇళ్లే అధికంగా ఉండటం విశేషం. దొంగతనం కేసుల్లో కోల్పోయిన సొమ్ము బాధితులకు లభించకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. దొంగిలించిన సొమ్ములో దాదాపు 20శాతం రికవరీ కావడం లేదు. .

### అధికంగా చోరీలు

మహబూబ్‌నగర్ పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లక్ష్మీనగర్ కాలనీ, పద్మావతి కాలనీ, భగిరథ కాలనీ, బీకే రెడ్డి కాలనీ, శ్రీనివాస కాలనీలో అధికంగా చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు ఎక్కువయ్యాయి. పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు. పలు కాలనీల్లో గస్తీని పెంచినా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. సీసీఎస్ పోలీసులు సొమ్మును రికవరీ చేస్తూనే ఉన్నారు. చోరీలను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. దొంగలు పట్టణ శివారు కాలనీలను, జన సంచారం తక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఇన్ని చోరీలు జరుగుతున్నా ప్రజలు ఇప్పటికి అప్రమత్తంగా వ్యవహరించడం లేదు. చోరీలు జరిగిన తర్వాత పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు తప్పా ముందస్తు జాగ్రత్తలు మాత్రం ఎవరు తీసుకోవడం లేదు.

### గస్తీ ముమ్మరం



దొంగతనాలు కట్టడి చేయడానికి గస్తీ ముమ్మరం చేశాం. పండగ సందర్భంగా కర్ర పత్రాలు తయారు చేసి పట్టణంలో పంపిణీ చేస్తాం. దొంగలను పట్టుకోవడానికి ఒక స్పెషల్ టీం ఏర్పాటుచేశాం. ముఖ్యమైన చోట్ల 51 వైర్‌లెస్ సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశాం. సెలవుల్లో చాలా మంది వివిధ ప్రాంతాలకు, సొంత గ్రామాలకు ఎక్కువగా వెళ్లేవారు నగదు, బంగారం ఇంట్లో పెట్టరాదు. రోడ్డు వైపునకు ఉండే ప్రధాన డోర్‌కు, గేట్‌కు తాళం వేయరాదు. జిల్లా కేంద్రంలో ఉన్న మూడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోలింగ్, రక్షకలతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ మహబూబ్‌నగర్

### అవకాశం కోసం ఎదురుచూపు

ఎప్పుడు సెలవులొస్తాయి.., ఎప్పుడు ఇళ్లకు తాళాలువేసి ఊళ్లకు వెళ్తారా..? అవి గమనించే దొంగలు అవకాశం కోసం ఎదురు చూస్తుంటారు. పట్టణాల్లో ఎండాకాలం సెలవుల్లోనే ఎక్కువగా చోరీలు జరుగుతాయి. పండుగ సెలవుల్లో ఇప్పటికే చాలామంది ఇళ్లకు తాళాలు వేసి సొంత గ్రామాలకు వెళ్లిపోయారు. దొంగలకు ఇది అదనుగా కాకూడదంటే అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే తాళం వేసిన ఇళ్ల రాత్రికి రాత్రి ఖాళీ అవుతాయి. బస్సులో ప్రయాణించేందుకు వెళ్తే ఖరీదైన వస్తువులు మాయమవుతున్నాయి.. బ్యాంకులకు వెళ్తే ముఠాలు నగదుని దోచుకెళ్తున్నాయి. ఇలా ప్రతీచోటా దొంగలు, దోపీడీ ముఠాల బెడద పెరిగింది. ప్రజలే స్వీయ రక్షణ పాటిస్తే దొంగతనాలు నిలువరించవచ్చు.

| దొంగతనాలు | 2022 | 2023 | 2024 |
|---|---|---|---|
| రాత్రి దొంగతనాలు | 88 | 124 | 163 |
| పగలు దొంగతనాలు | 13 | 33 | 38 |
| సాధారణ దొంగతనాలు | 223 | 267 | 294 |

| ఏడాది | ప్రాపర్టీ లాస్ట్ | ప్రాపర్టీ రికవరీ |
|---|---|---|
| 2022 | 2,10,11,934 | 1,01,94,590 |
| 2023 | 3,46,95,552 | 90,82,088 |
| 2024 | 3,83,99,107 | 1,05,20,810 |

### పోలీసుల్లోనూ దడ

ప్రస్తుతం పోలీసుల్లోనూ సెలవుల 'దడ' పట్టుకుంది. సెలవుల్లో చాలా మందికి తమ ఇళ్లకు తాళాలువేసి ఊర్లకు వెళ్తారు. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతుంటారు. గతంలో ఈ సీజన్‌లో చాలా మేర దొంగతనం కేసులు కూడా నమోదయ్యాయి. గుట్టుచప్పుడు కాకుండా తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు.


ఇటీవల పట్టణంలో ఓ ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్)

# జోగుళాంబ సన్నిధిలో ఉజ్జయిని పీఠాధిపతి


అలంపూర్‌లో బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఉజ్జయిని పీఠాధిపతి

- అలంపూర్ క్షేత్రాన్ని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన అలంపూర్ క్షేత్ర ఆలయాలను మధ్యప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు, ఉజ్జయిని పీఠాధిపతి బాల్ యోగి ఉమేష్‌నాథ్‌జీ మహారాజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉజ్జయిని పీఠాధిపతి, రాజ్యసభ సభ్యుడు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అర్చన, పూజలు నిర్వహించారు. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు వాల్మీకి నాయకులు ఉన్నారు.

❐ స్వాగతం పలికిన వాల్మీకి నేతలు రాజ్యసభ సభ్యులు, ఉజ్జయిని పీఠాధిపతి బాల్ యోగి ఉమేష్ నాథ్‌జీ మహారాజ్‌కు వాల్మీకి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ నెల 11వ తేదీ శనివారం రాత్రి ఆయన అలంపూర్ క్షేత్రానికి చేరుకున్నారు. ఈ క్రమంలో రాత్రి వాల్మీకి నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చిన బాల్ ఉమేష్‌నాథ్‌జీకి వాల్మీకి ఐక్యపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, వాల్మీకి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాల్‌ఉమేష్‌నాథ్‌జీతో వాల్మీకి నాయకులు సమావేశమయ్యారు. వారితో వాల్మీకుల స్థితిగతులపై చర్చించారు. వాల్మీకుల చిరకాల వాంఛగా ఉన్న ఎస్టీ రిజర్వేషన్ గురించి వాల్మీకి నాయకులు వివరించారు. అనంతరం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి తమ వంతుగా కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో మాట్లాడి ఎస్టీ రిజర్వేషన్ కోసం సహకారం అందించాలని కోరారు. అనంతరం బాల్ ఉమేష్‌నాథ్‌జీ మాట్లాడుతూ..దేశంలో ఉన్న అన్ని రాష్టాలలో పర్యటిస్తూ వాల్మీకుల సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలను చూపుతూ వస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అంశం గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. గత శీతకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశం గురించి కేంద్ర హోం మంత్రి, గిరిజన శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలను కలిసి వారితో చర్చిస్తామని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరించే విధంగా చూస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు నారాయణ, వెంకటరమణ, భరత్ ప్రసాద్, చిన్న కృష్ణయ్య, జగన్ మోహన్ నాయుడు, కృష్ణయ్య, శ్రీనివాసులు, రమణ, శేషన్న నాయుడు, రామ నాయుడు, మధు నాయుడు, అదాకర్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, రమేష్ నాయుడు, గద్వాల నాయకులు శివారెడ్డి, రాములు, సాలప్ప, దేవదాసు, రాముడు, మహేష్ తదితరులు ఉన్నారు.

# చిరుతపులి సంచారం

- భయాందోళనలో దుప్పట్‌గట్ గుట్ట వాసులు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్ గ్రామ శివారులోని దుప్పట్‌గట్ గుట్టపై ఆదివారం సాయంత్రం చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నాలుగు నెలల క్రితం ఫారెస్ట్ అధికారులు దుప్పట్‌గట్, నందిగామ, గోకుల్‌నగర్, గుట్టల్లో చిరుతపులులు ఉన్నట్లు గుర్తించి బోను ఏర్పాటుచేశారు. నందిగామ గ్రామ శివారులోని గుట్టల్లో చిరుత బోను చిక్కిన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఈ ప్రాంతంలోనే మరో రెండు చిరుతలు ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. అవి బోనుకు చిక్కకపోవడంతో బోను తీసివేశారు. మళ్లీ ఈ రోజు గ్రామానికి అనుకొని ఉన్న గుట్టపైనే చిరుత సంచారం కావడంతో ఆ గ్రామస్తులు భయాందోళనకు గురౌతున్నారు. ఈ గుట్టలోనే రెండు చిరుతలు సంచరింస్తున్నట్లు వారు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌కు అడుగగా ఉమ్మడి మద్దూరు మండలంలోని నందిపాడ్ గుట్టల్లో, దుప్పట్‌గట్, నందిగామ గుట్టల్లో చిరుత పులుల సంచారం ఉన్నట్లు గుర్తించాం. వీటికోసం బోను ఏర్పాటుచేసినా అందులో పడటం లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


దుప్పట్‌గట్ గుట్టపై ఉన్న చిరుతపులి

### ఆలయంలో ఆభరణాలు చోరీ

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని చర్లపల్లి గ్రామంలోని శివ సీతారామ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల మేరకు.. చర్లపల్లి గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా లక్ష్మారెడ్డి, ఆలయానికి శ్రీకాంత్‌స్వామి పూజారిగా పనిచేస్తున్నారు. పూజారి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు అనంతరం గుడికి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం 6:30 గంటల సమయంలో గుడి తెరవడానికి పూజారి వెళ్లగా గుడి తలుపులు, తాళాలు పగులగొట్టబడి ఉన్నాయి. దీంతో గుడిలో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అనంతరం గుడి లోపలి వెళ్లి చూడగా మూడు వెండి కిరిటాలు, బంగారు మంగళసూత్రం 8 గ్రాములు కనిపించలేదు, రూ.40వేల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

### లారీ బీభత్సం.. యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్రగాయాలు
- నుజ్జునుజ్జు అయిన స్కూటీ
- స్తంభించిన ట్రాఫిక్


నాగరాజు(ఫైల్)

కల్వకుర్తి టౌన్: లారీ అదుపుతప్పి బీభత్సం సృష్టించిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు.మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు.. వెల్దండ మండలంలోని రాచూర్‌లో ఉన్న వింటేజ్ కాఫీ కంపెనీలో పనిచేసే ఉద్యోగులు నాగరాజు(34), శ్రీను పట్టణంలోని సిల్వర్‌జూబ్లీ క్లబ్ దగ్గర కంపెనీకి వెళ్లే వాహనం కోసం వేచిచూస్తున్నారు. ఇంతలోనే దేవరకొండ నుంచి లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి అక్కడే ఉన్న వాహనాలను ఢీకొడుతూ ముందుకెళ్లింది. అక్కడే వేచిఉన్న వెంకటాపూర్‌కు చెందిన నాగరాజు, వంగూర్ మండలం కోనేటిపురానికి చెందిన శ్రీనును ఢీకొట్టి సిల్వర్‌జూబ్లీ క్లబ్ ముందు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. ఘటనలో లారీ టైర్ల కిందపడి నాగరాజు దుర్మరణం చెందాడు. శ్రీనుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇదే ఘటనలో స్కూటీని రోడ్డుపైన నిలిపి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లివచ్చే సరికి లారీ టైర్ల కింద నుజ్జునుజ్జు అయ్యింది. లారీ కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ శాఖాధికారులు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ లారీని విడిచిపెట్టి పారిపోయాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలు, లారీ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగరాజుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం జరగటంతో రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# హోరాహోరీగా హ్యాండ్‌బాల్ టోర్నీ


తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ బాలికల జట్ల మధ్య మ్యాచ్

- హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తున్న రాష్ట్ర బాల, బాలికల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో ఆయా రాష్ట్రాల జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ ఆదివారం మూడోరోజుకు చేరింది. టోర్నీలో మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతుండగా.. గెలుపే ధ్యేయంగా ఆయా జట్లు పోటీ పడుతున్నాయి. నేషనల్ టోర్నీలో ఆతిథ్య తెలంగాణ బాల, బాలికల జట్లు తమ సత్తాచాటుతున్నాయి. ఓటమి చవిచూడకుండా వరుసగా మూడు మ్యాచ్‌లను గెలుపొందాయి. జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో మెయిన్ స్టేడియంలో సందడి నెలకొంది. రాష్ట్రాల జట్లు ఒకవైపు మ్యాచ్‌లు ఆడుతూనే.. మరోవైపు కోచ్‌ల పర్యవేక్షణలో ప్రాక్టిస్ చేస్తున్నారు.

**వరుసగా మూడు మ్యాచ్‌ల్లో**

ఆదివారం జరిగిన మ్యాచుల్లో బాలుర విభాగంలో రాష్ట్ర జట్లు హ్యాట్రిక్ విజయాన్ని సాధించాయి. రాష్ట్ర బాలుర జట్టు 21– 10 గోల్స్ తేడాతో డీఏవీ జట్టుపై గెలుపొందింది. అలాగే బాలికల విభాగంలో కూడా తెలంగాణ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో తెలంగాణ బాలికల జట్టు 13– 4 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలుపొందింది. ఇతర బాలుర విభాగం మ్యాచుల్లో పంజాబ్ జట్టు 17– 15 గోల్స్ తేడాతో మహారాష్ట్ర జట్టుపై, గుజరాత్ జట్టు 24– 19 తేడాతో ఒడిశాపై, ఉత్తర ప్రదేశ్ జట్టు 15– 13 తేడాతో తమిళనాడుపై, సీఐఎస్‌ఈ జట్టు 14– 9 తేడాతో జమ్ముకాశ్మీర్, పశ్చిమ బెంగాల్ జట్టు 18– 16 తేడాతో కేరళ, హిమాచల్‌ప్రదేశ్ జట్టు 22– 17 తేడాతో అస్సాంపై, చండీఘర్ జట్టు 19– 7 తేడాతో జార్ఖండ్‌పై, మణిపూర్ జట్టు 20– 18 తేడాతో విద్యాభారతిపై, ఛత్తీస్‌ఘఢ్ జట్టు 16– 14 తేడాతో ఎన్‌వీఎస్‌పై, ఢిల్లీ జట్టు 20– 14 తేడాతో హరియాణాపై, బీహార్ జట్టు 25– 9 తేడాతో లద్దాఖ్‌పై గెలుపొందాయి.

### బాలికల విభాగంలో..


అస్సాం- కేవీఎస్ బాలికల జట్ల మ్యాచ్

లద్దాఖ్ జట్టు 5– 2 గోల్స్ తేడాతో, హర్యానా జట్టు 5– 2 తేడాతో సీఐఎస్‌ఈ జట్టుపై, రాజస్థాన్ జట్టు 20– 5 తేడాతో జమ్ము కాశ్మీర్‌పై, కేరళ జట్టు 9– 2 తేడాతో డీఏవీపై, ఛత్తీస్‌ఘఢ్ జట్టు 14– 5 తేడాతో తమిళనాడు, ఒడిశా జట్టు 15– 8 తేడాతో త్రిపురపై, కేవీఎస్ జట్టు 16– 5 తేడాతో విద్యాభారతిపై, సీబీఎస్‌ఈ జట్టు 14– 7 తేడాతో విద్యాభారతి, జార్ఖండ్ జట్టు 17– 3 తేడాతో మణిపూర్‌పై, హిమాచల్‌ప్రదేశ్ జట్టు 11– 7 తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, బీహార్ జట్టు 29– 7 తేడాతో ఎన్‌వీఎస్‌పై గెలుపొందాయి. మూడో రోజు మ్యాచ్‌లను నిర్వాహక కమిటీ ప్రతినిధి రజనీకాంత్‌రెడ్డి, ఎండీ జియావుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. టోర్నీలో క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. కార్యక్రమంలో పీడీ బాలరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న క్యాంప్ ఫైర్


క్యాంపు ఫైర్‌లో పాల్గొన్న బెక్కరి రాంరెడ్డి తదితరులు

మెయిన్ స్టేడియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన క్యాంప్‌ఫైర్ ఆకట్టుకుంది. ముందుగా క్యాంప్‌ఫైర్‌లో శ్రీరామజయరామ సంస్థల చైర్మన్ బెక్కరి రాంరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, మాజీ కార్యదర్శి సురేష్‌కుమార్, రజనీకాంత్‌రెడ్డి, బాలరాజు, జియావుద్దీన్, అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంప్‌ఫైర్‌లో అన్ని రాష్ట్రాల క్రీడాకారులు డాన్స్‌లతో హోరెత్తించారు. ముఖ్యంగా పంజాబీ, హిందీతోపాటు ఇతర భాషల పాటలకు క్రీడాకారులు నృత్యాలతో సందడి చేశారు.

# చెస్‌తో మేధో సంపత్తికి దోహదం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి
- రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలు ప్రారంభం


విద్యార్థులతో కలిసి చెస్ ఆడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్: చెస్‌తో మేధో సంపత్తికి దోహదపడుతుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అండర్–09 విభాగంలో 26టీంలు, అండర్–11 విభాగంలో 17టీంలు, అండర్–13 విభాగంలో 36టీంలు, జనరల్ విభాగంలో 58టీంలు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ చెస్ గేమ్‌తో ఆలోచన పరిణతి స్థాయి పెరుగుతుందని అన్నారు. వివిధ వృత్తుల్లోనూ క్రియాశీలకమైన నిర్ణయాలు తీసుకునేందుకు, జీవిత ఎదుగుదలకు సోపానాలుగా మారుతాయన్నారు. వనపర్తిలో క్రీడలకు మంచి పేరుఉందని, రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలువురు నిర్వహించిన క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలను సైతం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బసవప్రభు, కన్వీనర్ టీపీ కృష్ణయ్య, ప్రతినిధులు గణేష్, సత్యనారాయణ, వేణుగోపాల్, రాములు, మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, కౌన్సిలర్లు బ్రహ్మం, చీర్ల సత్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

### రివార్డ్ పాయింట్స్ అంటూ మోసం

- క్రిప్టో కరెన్సీలో సైబర్ నేరం
- రూ.65 లక్షల విలువగల బిట్‌కాయిన్ కాజేసిన కేటుగాళ్లు

వనపర్తి: క్రిప్టో కరెన్సీలో రివార్డ్ పాయింట్స్ క్లెయిమ్ చేసుకోవాలంటూ లింక్ పంపించి ఘరానా మోసానికి సైబర్ కేటుగాళ్లు తెరలేపారు. సుమారు రూ.65లక్షల విలువ గల బిట్‌కాయిన్‌ను కాజేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. వివరాలు.. కొత్తకోట పట్టానికి చెందిన యాదయ్య అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీలో ఇటీవల కొన్ని చేర్చుకున్నాడు. అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు ఆయనకు రివార్డ్ పాయింట్స్ క్లెయిమ్ చేసుకోవాలంటూ లింక్ పంపించారు. ఎంత ప్రయత్నించినా ఆలింకు ద్వారా అతడికి రివార్డ్ పాయింట్స్ రాలేదు. ముందస్తు ప్రణాళికతో ఉన్న సైబర్ నేరస్తులు యాదయ్యకు కాల్‌చేసి మీ అకౌంట్‌కు రివార్డ్ పాయింట్స్ యాడ్ చేస్తామంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడు వారిని తన బిట్ కాయిన్‌కు సంబంధించిన వివరాలను తెలిపాడు. నిమిషాల వ్యవధిలోనే తన ఖాతాలో ఉన్న రూ.65లక్షల విలువగల బిట్‌కాయిన్‌ను కాజేశారు. తాను మోసపోయినట్లు గుర్తించిన యాదయ్య శనివారం సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. వారి సిఫారసుమేరకు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. ఈ విషయమై వనపర్తి సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నంను సాక్షి వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధ్రువీకరించారు.